హైదరాబాద్ వార్త



# వామ్మో.. రోగాలు



**-జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో ప్రజల అవస్థలు**
**-అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల బాట**
**-150మందిని పరీక్షిస్తే 51మందికి తీవ్ర అనార్యోగ సమస్యలు**
**-శ్వాసకోస, ఊపిరితిత్తులు ,చర్మ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు**

**హైదరాబాద్, జూలై 2,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో హెల్త్ ఎమర్జెన్సీ ఏర్పడింది. తాజాగా కార్మిక నగర్‌లో నిర్వహించిన ఒక ప్రైవేట్ ఉచిత వైద్య శిబిరంలో ఇక్కడి ప్రజల అనారోగ్య పరిస్థితి వెలుగులోకి వచ్చింది. 150 మందికి పరీక్షలు చేస్తే.. వారిలో 51 మంది ప్రాణాంతక అనారోగ్యాల బారిన పడ్డారని.. ముఖ్యంగా 16 మంది ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని వైద్యులు వెల్లడించడం స్థానికంగా కలకలం రేపుతోంది. బాధితుల్లో అత్యధికులు శ్వాసకోశ, చర్మ వ్యాధుల బారిన పడ్డారు. ఊపిరితిత్తుల ఇబ్బందులు ఉన్నాయనే అనుమానంతో 26 మందికి ప్రత్యేక పరీక్షలు చేయగా.. వారిలో 16 మందికి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ఇతర తీవ్ర శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు తేలింది. అయితే ఇందులో వృద్ధులే కాకుండా చిన్న వయసు వాళ్లు కూడా ఉండడం గమనార్హం. డంపింగ్ యార్డు నుంచి నిరంతరం వెలువడే దుమ్ము, విషపూరిత కెమికల్ వాయువుల వల్లే వీరికి ఊపిరితిత్తుల సమస్యలు వచ్చాయని నివేదికలు చెబుతున్నాయి. దీనికి తోడు మరో 35 మంది తీవ్రమైన చర్మ వ్యాధులతో నరకం అనుభవిస్తున్నారు. దీంతో జవహర్ నగర్ డంపింగ్ యార్డు చుట్టు పక్కల నివసిస్తున్న సామాన్య జనాల ఆరోగ్య పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారుతోంది. రోజురోజుకూ ఇక్కడ పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్త, కాలుష్యం కారణంగా స్థానికులు ఊపిరి పీల్చుకోవడానికి కూడా భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

**కాలుష్య కోరల్లో 25 వేల మంది...**

దాదాపు 351 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసరాల్లోని 15 నుంచి 18 కాలనీల్లో సుమారు 25 వేల మందికి పైగా నిరుపేద, మధ్యతరగతి జనాభా నివసిస్తున్నారు. జవహర్ నగర్, దమ్మాయిగూడ, కార్మిక నగర్, బాలాజీనగర్, గబ్బిలాంపేట, అంబేద్కర్ నగర్, మల్కారం, రాజీవ్ గాంధీ నగర్, ప్రగతి నగర్, నాగారం, రాంపల్లి ప్రాంతాలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సాయంత్రం కాగానే ఈ చెత్త దుర్వాసన యాప్రాల్, సైనిక్‌పురి, ఈసీఐఎల్ వంటి సంపన్న కాలనీలకు కూడా పాకుతోంది. దీంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. ఇక్కడి నిరుపేదలు కనీసం ప్రైవేట్ ల్యాబ్‌లలో టెస్టులు కూడా చేయించుకోలేక బాలాజీనగర్ హెల్త్ సెంటర్ ఇచ్చే చిన్నచిన్న టాబ్లెట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కడతామన్న హామీ కేవలం కాగితాలకే పరిమితమైంది. సుమారు 40 రోజుల క్రితం అఖిలపక్ష సమావేశం అనంతరం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడికి వచ్చి విజిట్ చేసి హంగామా చేశారు. వ్యర్థాల నిర్వహణ చూసే "రాంకీ" సంస్థ కాలుష్య నియంత్రణలో పూర్తిగా విఫలమైందని నిలదీశారు. యార్డులోని మురుగు నీటిని శుద్ధి చేసే ఎస్టీపీ ప్లాంట్ సరిగ్గా పనిచేయకపోవడాన్ని కూడా గుర్తించారు. నిధులను స్థానిక ప్రజల తాగు నీరు, వైద్యానికి వాడాలని ఆదేశించినా.. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో రూపాయి మార్పు రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చుట్టుపక్కల ఉన్న 25 వేల మందికి ఉచితంగా పూర్తి స్థాయి వైద్య పరీక్షలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి శుక్రవారం 'డ్రై డే' నిర్వహించాలి

**-నాలాలో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవు -ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, జూలై 2 ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం వర్షాకాల ముందస్తు కార్యాచరణలో అధికారులు, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. చిలకనగర్ పార్కు, సరూర్‌నగర్ ప్రజా నివాస్ ఫేజ్-1, బీరప్ప గడ్డ రోడ్ ఉప్పల్, చిలకనగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. చిలకనగర్ లోని బ్యాంక్ కాలనీ పార్కును నిర్వహణ కోసం స్వయం సహాయక సంఘం సభ్యులకు అప్పగించిన నేపథ్యంలో పార్కును పరిశీలించారు. పార్కును అత్యంత పరిశుభ్రంగా, అందంగా నిర్వహిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధమైన నిబద్ధతతో పార్కు నిర్వహణ చేపడితే, భవిష్యత్తులో మరిన్ని పార్కుల నిర్వహణ బాధ్యతలను కూడా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తామని కమిషనర్ తెలిపారు. సర్కిల్ పరిధిలో మొక్కల నాటడం, హోమ్ షెడ్ మొక్కల పంపిణీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులను భాగస్వామ్యం చేస్తూ ప్రజల భాగస్వామ్యంతో పట్టణ హరితాభివృద్ధిని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ప్రజా నివాస్ ఫేజ్1, బజాజ్ పాయింట్ ప్రాంతాల్లో జీవీపీల తొలగింపులో భాగంగా నిరంతర చెత్త తొలగింపు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ చెత్త సేకరణ, పారిశుద్ధ్య చర్యలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతాలు చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. అలాగే ఉప్పల్ బీరప్పగడ్డ రోడ్డులో ప్రతి శుక్రవారం డ్రై డే, పారిశుద్ధ్య కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాలను పరిశీలించి, నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా జీవీపీ పాయింట్లను పరిశీలించి, చెత్త తొలగింపు ఎంత తరచుగా జరుగుతోందని ఆరా తీశారు. ప్రతి రోజూ చెత్తను తొలగిస్తూ శాశ్వతంగా జీవీపీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచించారు. వీటితో పాటు ఉప్పల్ చిలకనగర్ మెయిన్ రోడ్డులో ఓపెన్ నాలా వద్ద జీవీపీని కమిషనర్ పరిశీలించారు. జీవీపీ వద్ద చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని, నాలాలోకి చెత్త చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, అక్రమంగా చెత్త వేస్తున్న వారిపై జరిమానాలు విధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో నీటి పారుదల సజావుగా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.



పార్కు నిర్వహణ పనితీరును పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

# ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాలు తొలగింపు



హైకోర్టు రహదారిలో అక్రమ ఫుట్ ఫాత్‌ల తొలగింపు



పెట్లాబుర్జు ఆసుపత్రి రహదారిలో తొలగించిన హోటళ్లు,పాన్ షాపుల డబ్బాలు

**చార్మినార్,జూలై 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని ప్రధాన రహదారులో ఫుట్ ఫాత్‌లను ఆక్రమించి నిర్మించిన హోటళ్లు, పాన్ షాపులు,దుకాణాల ముందు ఉన్న బోర్డులను జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ అధికారులు తొలగించారు.ఈ సందర్భంగా చార్మినార్, హుస్సేనీఆలం పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.పాతనగరంలోని మదీనా సర్కిల నుంచి హైకోర్టు రహదారి మీదుగా పురానాపూల్ గుడ్ విల్ హోటల్ వరకున్న ఫుట్ ఫాత్‌లను అక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను జిహెచ్ఎంసి అధికారులు గురువారం ఉదయం తొలగించారు.పాతబస్తీలో ఫుట్‌ఫాత్‌లలో వెలసిన అక్రమ కట్టడాలను తొలగించు సమయంలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అదే విధంగా మదీనా సమీపం నుంచి హైకోర్టు రోడ్డులోనిజిలాబీలు షాపులు వరకు షాపుల ముందున్న అరుగులు,షాపులకు ముందున్న బోర్డులను తొలగించటంతో పాటు ఫుట్ ఫాత్‌లను ఆక్రమించి కట్టిన వాటిని తీసి వేశారు.పెట్లాబూర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రహదారిలోని ఫుట్‌ఫాత్ మీద అక్రమంగా వెలిసిన చిన్న,చిన్న హోటళ్లు,ఫాన్ షాపు డబ్బాలన జిహెచ్ఎంసి అధికారులు తొలగించారు.ఈ సందర్భంగా చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టరన రాంబాబు,హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## డిటీఆర్ మ్యాపింగ్‌తో సేవలు మరింత పారదర్శకం

**-టిజిఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్**

**హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త:**

వినియోగదారులకు మరింత వేగవంతం, నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి. పాటిల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా బిల్లింగ్ ప్రక్రియలోనే వినియోగదారుల విద్యుత్ సర్వీసులను సంబంధిత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) స్ట్రక్చర్ కోడ్‌లతో అనుసంధానం చేసే విధంగా ఎస్‌బిఎం (ఆటోమేటెడ్ స్పాట్ బిల్లింగ్ మెషిన్) సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ కొత్త విధానంలో మీటర్ రీడర్ ఒక డీటీఆర్ స్ట్రక్చర్ కోడ్‌ను ఎంపిక చేసి, ఆ డీటీఆర్‌కు అనుసంధానమైన అన్ని సర్వీసుల బిల్లింగ్‌ను వరుస క్రమంలో నిర్వహిస్తారన్నారు. దీంతో ప్రతి వినియోగదారు సర్వీస్ సరైన డీటీఆర్‌కు ఖచ్చితంగా మ్యాపింగ్ అవుతుందని ఆయన తెలిపారు. డీటీఆర్ మ్యాపింగ్ ద్వారా విద్యుత్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమగ్ర, ఖచ్చితమైన డేటా అందుబాటులోకి వస్తుందని, ఫలితంగా విద్యుత్ సరఫరాలో లోపాలను వేగంగా గుర్తించడం, అంతరాయాల విశ్లేషణ, నిర్వహణ పనులను సమర్థవంతంగా చేపట్టడం, వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం సాధ్యమవుతుందని సీఎండీ పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునికీకరించడం, డేటా ఆధారిత నిర్ణయాలను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## 'సర్' ప్రక్రియ వేగంగా కొనసాగించాలి

**-జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్**



ముషీరాబాద్‌లో స్థానికల ప్రజలతో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త:** సర్ ప్రక్రియలో భాగంగా బిఎల్‌వోలు ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా అందజేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌తో కలిసి 57ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని దయానంద్ నగర్, ఆదిక్‌మెట్ ప్రాంతంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటింటి సర్వే) కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడటంతో పాటు వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతుందో సమీక్షించారు. అలాగే, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, కేటాయించిన పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ,ఓటర్లకు సమర్థవంతంగా సేవలు అందించాలని బిఎల్‌వోలు,పర్యవేక్షక అధికారులకు ఆయన ఆదేశించారు.

## సాహసాలు..నేరుగా యమపురికో,ఆస్పత్రి బెడ్‌కో చేరుస్తాయి

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త**



రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా కొందరు మారడం లేదు. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కనీస రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకుండా డివైడర్‌పై ద్విచక్రవాహనం నడుపుతున్న ఓ యువకుడి వీడియోను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వాహనదారులకు విలువైన సూచనలు చేశారు."హెల్మెట్ లేదు, ట్రాఫిక్ నిబంధనలపై గౌరవం లేదు.. కేవలం డేర్ డెవిల్ విన్యాసాలు మాత్రమే! డివైడర్లు రోడ్లను విభజించడానికి ఏర్పాటు చేసినవి తప్ప మీ ద్విచక్రవాహనాలు ర్యాంప్ వాక్ చేసేందుకు కాదు. కొద్ది నిమిషాల సమయం ఆదా చేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టకండి. ఇలాంటి సాహసాలు మిమ్మల్ని గమ్యస్థానాలకు కాదు.. నేరుగా యమపురికో లేదా ఆస్పత్రి బెడ్‌కు చేరుస్తాయి.రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని తన పోస్టులో పేర్కొన్నారు.

## 50 కేజీల కల్తీ మాంసం సీజ్



**మెహిదీపట్నం, జూలై 02, ప్రభాతవార్త :** మేక మాంసం తో పాటు ఎద్దు మాంసాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్న ఓ ముఠాను అరెస్టు చేసిన సంఘటన అబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, స్థానిక పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కల్తీ మాంసం గుట్టు రట్టయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేపల్లి ప్రాంతంలో ఉస్మాన్ ఖురేషి మాంసం షాపును నిర్వహిస్తున్నాడు. నగరంలోని ఫేమస్ హోటల్ తో పాటు బిర్యానీ పాయింట్లకు మేక మాంసం అమ్ముతుండడంతో తక్కువ ధరకే వస్తున్న ఎద్దు మాంసాన్ని విక్రయించి మేక మాంసంతో కలిపి హోటల్ లకు సప్లై చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతని షాప్ లో తనిఖీలు నిర్వహించి కల్తీ చేసిన 50 కేజీల మాంసాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన మాంసాన్ని టెస్టింగ్ కోసం చర్లపల్లి లోని ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని తెలంగాణ స్టేట్ ఫుడ్ లాబరోటరీకి పంపించినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గోల్కొండ కోట జగదాంబికా మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ ట్రస్ట్ సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న ఈవో వసంత

**మెహిదీపట్నం, జులై 2, ప్రభాతవార్త :** చారిత్రాత్మక గోల్కొండ కోట శ్రీ జగదాంబికా మహంకాళి (ఎల్లమ్మ తల్లి) దేవాలయ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఆలయ నూతన కమిటీ చైర్మన్ గా ఆకుల చంద్రశేఖర్ ను నియమించారు. సభ్యులుగా వివేక్ గౌడ్, భరత్, దినేష్ కుమార్, వీరస్వతి, గీత, శ్యామల ను ఆలయంలో ఈ.ఓ వసంత, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రాజా రాజేశ్వర్ సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి చల్లగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడాది కూడా గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను అత్యంత వైభవపేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో పాటు దేవాదాయ శాఖ అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తానని తెలిపారు. బోనాల ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు పరమానందం, కే. చంటిబాబు, స్థానిక నాయకులు ఆకుల గోవర్ధన్, ముంగి రఘుపాల్ రెడ్డి, రాజు ఉస్తాద్, ఆలయ పూజారి సర్వేశ్వర్ తో సంతోష్ గౌడ్, శ్రీకాంత్, శంకర్, శ్రీరాములు, వినోద్, మాధవి, వనజ తంగడపల్లి శివశంకర్ లు పాల్గొన్నారు.

## ఢిల్లీ బోనాలకు మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం



బోనాలకు మంత్రి వాకిటి శ్రీహరిని ఆహ్వానిస్తున్న ఆలయ ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జూలై 2, ప్రభాతవార్త :** లాల్‌దర్వాజా శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి మూడు రోజుల పాటు నిర్వహించే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆ ఆలయ కమిటి ఆహ్వానించింది. ఆలయ చైర్మన్ జి.అరవింద్ ఉమార్ గౌడ్ బృందం మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. డిల్లీలో ఉత్సవాల గురించి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్ గౌడ్, కోశాధికారి జి.హరీష్ గౌడ్, కమిటీ ప్రతినిధులు జె.రాజేష్ గౌడ్, ఎ.భరత్ కుమార్, దశరథ్ సప్నేకర్, సుధీర్ గౌడ్, కాంగ్రెస్ నేత నరసింహ గౌడ్ తదితరులు ఉన్నారు.

## రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న బాలుడిని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి

**-ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**
**-గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు**

**కంటోన్మెంట్,జూలై 2 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తల్లితో పాటు నిద్రిస్తున్న 3 సంవత్సరాల బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉప్పల్ చిలుకా నగర్ ప్రాంతానికి చెందిన రాజేశ్వరీ అనే మహిళకు ఇటీవల తన భర్త మరణించగా తన 5 యేండ్ల కుమారుడు నిఖీల్‌తో కలిసి తన తల్లివద్ద నివాసం ఉంటున్నట్లు పోలీసులకు తెలిపారు. గత నెల 20వ తేదీన తన తల్లి గొడవపడిన రాజేశ్వరీ కూలి పని నిమిత్తం బయలు దేరినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కూలి పని కోసం ఇంట్లో నుంచి బయలు దేరిన రాజేశ్వరీ తన కుమారుడు నిఖీల్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు తన స్నేహితురాలైన అర్చనకు సమాచారం ఇచ్చింది. స్టేషన్‌లోని 1వ ప్లాట్ ఫారం వద్ద తన కుమారుడిని చీర కొంగుతో నిఖీల్‌ను కట్టుకొని నిద్రపోగా కొద్దిసేపటికి ఆమె ఒడిఓ ఉన్న బాలుడు కనిపించకుండా పోయాడు. నిద్రలో నుంచి మేల్కొన్న రాజేశ్వరీ తన 5 సంవత్సరాల కుమారుడు నిఖీల్ జాడ కోసం రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్ ఫారాలను, పరిసర ప్రాంతాలను వెతికినప్పటికి కనిపించకుండా పోయింది. దీంతో రాజేశ్వరీ సికింద్రాబాద్ జి.ఆర్.ఫి.పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకున్న జి.ఆర్.పి.పోలీసులు సీసీటీవి పుటేజీల ఆధారాలతో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడిని ఎత్తుకెళ్లిన దుండగుడిని,అ బాలుడిని పట్టుకునేందుకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 5 యేండ్ల బాలుడిని ఎత్తుకెళ్తున్న దుండగుడి దృశ్యం

## మాజీ డీజీ ఏకే ఖాన్ కుమారుడిపై కేసు నమోదు

**- సినిమా పెట్టుబడుల పేరుతో మోసం.**

**జూబ్లీహిల్స్, జూలై 2, ప్రభాతవార్త:** మాజీ డీజీపీ ఏకే ఖాన్ కుమారుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. సినిమా నిర్మాణానికి పెట్టుబడిదారులను పరిచయం చేస్తామని నమ్మించి రూ.50 లక్షలు తీసుకున్న వ్యవహారంలో ఏకే ఖాన్ కుమారుడితోపాటు మరొకరిపై పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పుప్పాలగూడ, మణికొండలోని ఎన్ఆర్ సీతార అపార్ట్‌మెంట్‌లో నివసించే వెంకట అనీష్ రెడ్డి(36) తెలుగు చిత్రాల నిర్మాతగా పనిచేస్తున్నారు. గత రెండేళ్లుగా 'మహారాగ్ని' పేరుతో ఓ సినిమా నిర్మిస్తున్న ఆయన, చిత్రానికి పెట్టుబడిదారుల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇదే సమయంలో జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లోని సన్‌లిట్ గ్రూప్ కార్యాలయంలో మొహ్సిన్ ఖాన్(ఏకే ఖాన్ కుమారుడు), తబ్రేజ్‌లతో పరిచయం ఏర్పడింది. పెట్టుబడిదారులను పరిచయం చేస్తామని నమ్మబలికిన మొహ్సిన్‌కు 2025 ఆగస్టులో రూ.25 లక్షలు, తబ్రేజ్‌కు మూడు విడతల్లో మరో రూ.25 లక్షలు ఇచ్చాడు. డబ్బులు తీసుకున్నప్పటి నుంచి ఇద్దరూ ఒక్క పెట్టుబడిదారుని కూడా పరిచయం చేయకుండా, ప్రశ్నించిన ప్రతిసారీ సాకులు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రశాసన్ నగర్‌లోని సన్‌లిట్ గ్రూప్ కార్యాలయానికి వెళ్లిన వెంకట అనీష్‌రెడ్డి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, మొహ్సిన్ ఒక గదిలోకి పిలిచి 'డబ్బులు అడుగుతావా.. అంటూ బెదిరించడమే కాకుండా నిర్బంధించగా, అక్కడున్న బౌన్సర్లు ఆయుధాలు చూపించి భయభ్రాంతులకు గురిచేశారు. మొహ్సిన్, అతని బౌన్సర్లు దాడికి పాల్పడ్డారు. తబ్రేజ్ ఫోన్ ద్వారా మొహ్సిన్‌తో మాట్లాడుతూ ఘటనలో పాలుపంచుకున్నాడని, ఇద్దరి వల్ల తన ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 126(2), 115(2), 352, 351(2) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బార్బీ క్యూ నేషన్‌లో ఫుడ్ తిని ఇద్దరికి ఫుడ్‌పాయిజన్

**-తనిఖీలు చేసిన అధికారులు ..**

**-నిల్వ ఉంచిన మాంసం,పాడైన ఐస్‌క్రీమ్స్ గుర్తింపు**



**అత్తాపూర్ జూలై2 ,ప్రభాతవార్త :** అత్తాపూర్‌లోని బార్‌బేక్యూ నెషన్‌లో కుళ్లిపోయిన మాంసం ఫుడ్ తిని ఇద్దరు ఫుడ్‌పాయిజన్ గురై ఆసుపత్రి పాలైయ్యారు.వెంటనే బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం అత్తాపూర్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలో కుళ్లిపోయిన నిల్వఉంచిన మాంసం ,పాడైన ఐస్‌క్రిమ్స్,ఫ్రూట్స్ గుర్తించారు.హోటల్ నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు.పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచినా ,కుళ్లిన మాంసం నిల్వ చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అనంతరం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సౌమ్య మాట్లాడుతూ...అత్తాపూర్‌లోని బిబి క్యూ నెషన్‌లో ఫుడ్ తిని ఇద్దరికి ఫుడ్ పాయిజన్ అయిందని ఫిర్యాదులు రావడం జరిగిందని వెంటనే తనిఖీ చేసి హోటల్‌ను పరిశీలించగా నిల్వ ఉంచిన మాంసం లభ్యమైందని అయితే నాలుగు,మూడు రోజులుగా మాంసం ఆహారం నిల్వ ఉంచి కస్టమర్లకు ఇవ్వడంతోనే ఈఘటన జరిగినట్లు చెప్పారు.నిల్వ ఉంచిన ఆహారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జరిమానా విధించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్

## ఎస్ఐఆర్ అంతా గందరగోళం : టిడిపి

**ముషీరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అంతా గందరగోళంగా తయారయిందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు ఆరోపించారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమం క్షేత్రస్థాయిలో పూర్తిగా దారి తప్పిందని, అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ లెవల్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఫారంలు ఇవ్వకుండానే ఇళ్లకు స్టిక్కర్లు వేస్తున్నారని, కొన్ని ప్రాంతాలలో తమ అధికారిక లాగిన్ ఐడులు, పాస్‌వర్డ్‌లు ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి, సర్వే చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. శిక్షణ తీసుకోని బీఎల్ఓలకు సరియైన అవగాహన లేకపోవటం వల్ల ఫారాలు నింపటంపై వారికి కూడా అవగాహన లేదని, కలెక్టర్లు, ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవకతవకలపై సమీక్ష నిర్వహించాలని కోరారు. ఏ ఒక్క అర్హుడైన ఓటర్ కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కాసుల సుదర్శన్‌రెడ్డి, తడక వినోద్‌నేత, శ్యాంసుందర్, కరణం కిరణ్, భాను ప్రకాష్, అనిల్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమాలు

**చిక్కడపల్లి ,జులై 2, ( ప్రభాతవార్త ) :** మేము సేవ చేస్తాము అనే



లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది లయనిస్టిక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రభుత్వ హైదరాబాద్ శతాబ్ది లయనిస్టిక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలికసదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టిందని వివరించారు. గురురువారం సేవ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె. సత్యనారాయణ అధ్యక్షతన మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో దత్తత తీసుకున్న ఈ పాఠశాల ప్రాంగణంలో రీజియన్ చైర్మన్ లయన్ నల్లా సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులు, స్థానికులతో కలిపి మొత్తం 656 మందికి లబ్ది చేకూర్చేలా సుమారు రూ. 10,116 వ్యయంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 100 మొక్కలను నాటడం, పంపిణీ చేయడం చేశారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు 100 నోట్‌బుక్స్, 100 విద్యా కిట్లను అందజేశారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న ముగ్గురు వైద్యులను, ముగ్గురు నర్సులను క్లబ్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. క్లబ్ చేసిన సేవలకుగానూ జిల్లా స్థాయిలో నాలుగు ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కినట్లు క్లబ్ కార్యదర్శి పేరి నాగేశ్వరరావు తెలిపారు.పేరి నాగేశ్వరరావుకు ఎక్సలెంట్ డిస్ట్రిక్ట్ చైర్మన్ , బెస్ట్ సెక్రటరీ అవార్డులతో పాటు.. క్లబ్‌కు బెస్ట్ హంగర్ రిలీఫ్ ప్రాజెక్ట్ , బెస్ట్ స్కూల్ అడాప్షన్ ప్రాజెక్ట్ అవార్డులు లభించాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరి విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### డాక్టర్ బిఎన్ఎస్ కుమార్ స్మారకంగా ఇంద్రజాల ఉత్సవాలు

**చిక్కడపల్లి, జులై 2, ప్రభాతవార్త :** దివంగత సీనియర్ మెజీషియ



సీనియర్ మెజీషియన్స పూర్వ ఉన్నతాధికారి డాక్టర్ బి.ఎన్.ఎస్. కుమార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దనమూర్తి, మల్లం రమేష్ తదితరులు

న్, సచివాలయ పూర్వ ఉన్నతాధికారి డాక్టర్ బి.ఎన్.ఎస్. కుమార్ స్మారకార్థం ప్రతి ఏడాది జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఇంద్రజాల ఉత్సవాలను నిర్వహించాలని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్ణయించిందని అధ్యక్షుడు కళావిఎస్ జనార్దనమూర్తి వివరించారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ లో త్యాగరాయ గానసభ, ఆనందలహరి సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బి.ఎన్.ఎస్. కుమార్ సంస్మరణ సభ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కళా జనార్ధనమూర్తి మాటాడుతూ, అనేక మంది కళాకారులకు ప్రోత్సాహం అందించి ఇంద్రజాల కళాభివృద్ధికి విశేష కృషి చేసిన డా. బి.ఎన్.ఎస్. కుమార్ లేని లోటు కళారంగానికి తీరనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మిమిక్రీ కళాకారుడు, దర్శకుడు కళారత్న మల్లం రమేష్, సీనియర్ మెజీషియన్లు రఘుబాబు, ప్రదీప్ రంగరేజ్, క్రాంతికార్, ఆంజనేయులు, విజయకాంత్, మథిన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, మిమిక్రీ కళాకారుడు కాపర్తి నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విహెచ్‌ను పరామర్శించిన చిన్నారెడ్డి

హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త



రాష్ట్రప్రభుత్వ సలహాదారు విహెచ్‌ను పరామర్శిన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావును గురువారం పలువురు ప్రముఖులు ఆస్పత్రిలో పరామర్శించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి,బీసీ సంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం కార్పొరేషన చైర్మన్ శ్రీనివాస్ రాజు, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్, బట్‌రాజు కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు, కల్లుగీత కార్మిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజుగౌడ్, బోయ వాల్మీకి కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ బీసీ కమిషన్ నెంబర్ రాపోలు జయప్రకాష్, కరీంనగర్ సిటీ అధ్యక్షుడు అంజన్ బాబు, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కే.దుర్గేష్‌గౌడ్ తదితరులు విహెచ్‌ను పరామర్శించినవారిలో ఉన్నారు.

# జలమండలిలో 735 కొత్త పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

**-త్వరలో ఉద్యోగ, కార్మికులకు ప్రమోషన్లు**

**-ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి**

**హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త**

జలమండలిలో 735 కొత్త పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి తెలిపారు. జలమండలిలో కొత్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున జలమండలి ఉద్యోగ, కార్మికులు గురువారం జలమండలి కేంద్ర కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జి. వివేక్ వెంకట్‌స్వామి, మొగుళ్ళ రాజిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, జలమండలి ఎండి అశోక్‌రెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మొగుళ్ళ రాజి రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.పి. రాఘవేంద్ర రాజ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వై. నాగన్న గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని, పార్లమెంట్ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఉత్తర్వులు విడుదల చేయడం అభినందనీయమని, రాష్ట్ర



సిఎం,మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి తదితరులు

ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కు తెలంగాణ జలమండలి ఉద్యోగులు, కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్ద కాలంపైగా జలమండలిలో కొత్త ఉద్యోగాల సృష్టి లేకుండా ఉన్న ఉద్యోగులపై భారీ పని భారం పడేదని, ఉద్యోగ, కార్మికులకు ప్రమోషన్లు కూడా దక్కకుండా పోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత గత రెండున్నర ఏళ్ళ కాలంలో టీజెఈయు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనేక కార్మిక సమస్యలను పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఈ సమావేశంలో టీజెఈయు అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, మేవ ప్రధాన కార్యదర్శి సయ్యిద్ అక్తర్ అలీ, నేతలు ఆనంద్ రెడ్డి, సి. రాజు, సిహెచ్. ప్రవీణ్ కుమార్, మజారుద్దీన్, తిరుపతి, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక శాఖ సూపరింటెండెంట్‌ను బురిడి కొట్టించిన సైబర్ కేటుగాళ్లు

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒకవైపు పోలీసులు పలు కేసులను ఛేదిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. మరోవైపు ఉన్నతాధికారులు సైతం ఈ సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్నారు. తాజాగా తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహాలక్ష్మిని సైతం మోసగించి డబ్బులు కాజేశారు. ఆమెతోపాటు వేర్వేరు సంఘటనల్లో మరో ముగ్గురిని సైతం ఇలానే మోసగించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ కేటుగాళ్లు మొబైల్ హ్యాకింగ్, నకిలీ ఆర్‌టీఓ చలాన్ యాప్, రుణం పెంచిస్తామని నమ్మించడం, ఇంటి నుంచే ఉద్యోగం పేరుతో మోసం చేసి మొత్తం రూ.2.92 లక్షలకు పైగా కాజేశారు.

- జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివసించే అగ్నిమాపక శాఖ డీజీ కార్యాలయ సూపరింటెండెంట్ కె. మహాలక్ష్మి ్మకి ఎస్ బీఐ అసిస్టెంట్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి ఫోన్ చేసి, రుణ పరిమితిని పెంచిస్తామని నమ్మించి రూ.76,300 బదిలీ చేయించుకున్నాడు. అనంతరం మోసపోయానని గుర్తించిన బాధితురాలు 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను ఆశ్రయించగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

- బంజారాహిల్స్‌కు చెందిన ముస్తకీమ్ అలీ ఖాన్ తన మొబైల్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ఇన్‌స్టాల్ చేసిన అనంతరం ఫోన్ సరిగా పనిచేయకపోవడంతో పాటు, గుర్తు తెలియని వ్యక్తులు అతని బ్యాంకు ఖాతా నుంచి అనధికారిక లావాదేవీల ద్వారా రూ.77 వేల రూపాయలు కాజేశారు. తన మొబైల్ హ్యాక్ అయిందని అనుమానించిన బాధితుడు 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

- బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్ మొబైల్‌లో నకిలీ ఆర్టీఓ చలానా ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత అతని ఫోన్‌పే ఖాతా నుంచి రూ.42,900 కాజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

- బోరబండకు చెందిన మల్కాజిగిరి శిరీష ఇంటి నుంచే పని చేసే ఉద్యోగం కోసం యూట్యూబ్‌లో వచ్చిన పెన్సిల్/పెన్ ప్యాకింగ్ ఉద్యోగ ప్రకటనను చూసి అందులో ఉన్న టన్ను అనే వ్యక్తిని సంప్రదించారు. ఉద్యోగం ఇస్తామని నమ్మించిన నిందితుడు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, జీఎస్టీ, సెక్యూరిటీ డిపాజిట్ తదితర పేర్లతో విడతల వారీగా ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.96,500 వసూలు చేశాడు.

అనంతరం ఉద్యోగం ఇవ్వకపోగా, డబ్బు కూడా తిరిగి చెల్లించకుండా స్పందించడం మానేయడంతో బాధితురాలు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా అరవింద్ రెడ్డి

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 2, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ బి. మహేష్ కుమార్ గౌడ్, కూకట్‌పల్లి ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ అధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ల ప్రెసిడెంట్ల నియామకాలను ఖరారు చేశారు.ఈ నియామకాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ (డివిజన్ నెం. 252) ప్రెసిడెంట్‌గా దెంది అరవింద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కొత్తగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు అందరూ క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి శ్రమించాలని, సంస్థాగత నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని బి. మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షి ంచారు.

## విద్యుత్ లేని ప్రాంతాలు...

**అఫ్జల్‌గంజ్, జులై 2, ప్రభాతవార్త:** బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగాశుక్రవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.11 కెవి ఫైర్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు గురుద్వారాలైన్,అమృత్‌బార్ తదితర ప్రాంతాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.11 కెవి రంగ్ మహల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రంగ్‌మహల్,మెడికల్ కళాశాల, ఆర్‌టిసి కాంప్లెక్స్,అధిత్య ఆసుపత్రి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.11 కెవి ఇసామియాబజార్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి.సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ మరమ్మత్తుల కారణంగా ఇసామియాబజార్, గుజరాత్‌గల్లీ,ఆంధ్రాబ్యాంకు,ఆర్‌టిసి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.

## గోషామహల్‌లో చీరెల పంపిణీ



మహిళాలకు చీరెల పంపిణి చేస్తున్న గోషామహల్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గోకరణ్‌సింగ్

**బేగంబజార్, జులై 2,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీరల పంపిణిలో భాగంగా గోషామహల్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోషామహల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగోకరణ్‌సింగ్ మహిళా గ్రూపులకు చీరెలను అందచేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నయ్యలాల్‌సాహు, సర్వర్, మహ్మద్‌ఇస్మాయిల్,హరున్‌ఖాన్, నర్మద, రాజు, కరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అధికారులు ,సిబ్బంది సత్కరించారు.ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం సరస్వతి పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తాం

**: పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ**



పనులను పరిశీలిస్తున్న గాంధీ

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 2, ప్రభాతవార్త**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను సిఎంసి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళను తొలగించడం జరుగుతుందని తెలియచేసారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మబండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినదని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## టిజిసిహెచ్‌ఈ బి-కేటగిరీ అడ్మిషన్ అప్లికేషన్ గడువు పొడిగించాలి

**-హైయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్‌కు ఎస్సీ,ఎస్టీ విద్యార్థి,యువజన సంఘం వినతి**



చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సర్దార్ సింగ్, సైదులు, రాంకిషన్, సందీప్ తదితరులు

**హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త:**

టిజిసిహెచ్‌ఈ బి-కేటగిరీ అడ్మిషన్ గడువు మరో పదిరోజులు పొడిగించాలని తెలంగాణ ఎస్సీ,ఎస్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది.ఈమేరకు గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ సింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్టారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి డిమాండ్ పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ సింగ్ మాట్లాడుతూ పిజిఈఏపిసెట్ ఫస్ట్‌ఫేజ్ రిలీజ్ కాకముందే బి-కేటగిరీ నోటిఫికేషన్ రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొందన్నారు. కావున బికేటగిరి ఆన్‌లైన్ అప్లికేషన్ గడువు మరో 10రోజులు పొడిగించి, మెరిట్ విద్యార్థులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థి ప్రతి ఇంజనీరింగ్ కళాశాలలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరగా ఛైర్మన్ సానుకూలంగా స్పందించి, బాధ్యతగా బహిరంగ ర్యాటిఫికేషన్ చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున సంఘం సర్దార్ సింగ్ ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు సైదు లు, రాంకిషన్, సందీప్, బాను, శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సంస్థల అనుబంధం ఆత్మీయత సంప్రదాయవంతం : డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, జులై 2, ప్రభాతవార్త :** సాంస్కృతిక సంస్థలు పోటీలకు అనవర బేషజాలకు పోకుండా ఎంతో అనుబంధ, అనురాగం, ఆత్మీయత, ప్రేమాభిమానాలతో ఒకరికొకరు సహరించుకుంటూ ముందుకుసాగడం మంచి సంప్రదాయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ప్రముఖ రంగస్థలనటుడు, దర్శకుడు, సినీ టీవిన టుడు సత్కళాభారతి అధ్యక్షుడు జి.సత్యనారాయణ 77వ జన్మదినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, డా. ఎం.పురుషోత్తమాచార్య, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో జాతీయ పురస్కార స్వీకర్త, ప్రముఖ సినీగేయ రచయిత, గాయకుడు కాసర్ల శ్యామ్‌కు సత్కళాభారతి సత్కారం; ప్రముఖకవి, గాయకుడు, నటుడు రాగావధాని పానకంటి దక్షిణామూర్తి, ప్రముఖ



సత్కళాభారతి పురస్కారగ్రహీతలతో రమణాచారి, రఘురామ్, సత్యనారాయణ, హనుమంతరావు, పురుషోత్తమాచార్య తదితర అతిథులు

రంగస్థల, టీవి సినీనటి బి.హైమవతిలకు సత్కళాభారతి పురస్కారాలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. సభకు మద్దాళి రఘురామ్ స్వాగతం పలుకగా సభకుముందు సాంస్కృతిక కార్యక్రమాల్లో పి.దక్షిణామూర్తి ప్రామాణిక పద్యగానం; గంజి సత్యనారాయణ హరే శ్రీకృష్ణ ఏకపాత్రాభినయం ఆహుతులను తన్మయుల్ని చేశాయి.

# నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలి

**-తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఏర్పాటు**

**- రేపటి నుండి బాచుపల్లి, వరంగల్ విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో నిరాహార దీక్షలు**

**నాంపల్లి, జులై 2, ప్రభాతవార్త :** నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని యధాతథంగా కొనసాగించాలని, ప్రైవేట్ సంస్థల, వ్యక్తుల విశ్వవిద్యాలయ దురాక్రమణల ప్రయత్నాలను అడ్డుకోవాలని గురువారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, సాహితీ సాంస్కృతిక వర్గాల ప్రముఖులు భారీయెత్తున ఐక్యగళంతో నిరసించారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలి, నాంపల్లి ప్రాంగణాన్ని యధాతథంగా కొనసాగించాలి, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని తీవ్రస్థాయిలో నినాదాలలో హోరెత్తించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ఆద్యకళకు రెండెకరాల స్థలాన్ని కేటాయించినా మళ్లీ తిరుమలరావు, కోదండరామ్‌లు తెలుగు విశ్వవిద్యాలయంలో కాలుమోపడం దురదుష్టకరం, విశ్వవిద్యాలయ స్థలాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తపరిచారు. తెలుగుభాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ విశ్వవిద్యాలయాన్ని బలహీనపరిచే చర్యలను పూర్తిగా విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆద్యకళ ఆధీనంలో ఉన్న పాత వస్తువులు, సామాగ్రిని ప్రభుత్వం ఏర్పాటుచేసిన మ్యూజియంకు తరలించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం జ్యోతిష్యం, యోగా, బి.డిజైన్, పద్యనాటకం, దూరవిద్య తోపాటు పలుకోర్సుల్లో 2500మందికిపైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, ప్రస్తుతమున్న తరగతి గదులే సరిపోని పరిస్థితి ఉందని, గదులను ఇతర అవసరాలకు కేటాయిస్తే విద్యాకార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు.

**తెలుగు విశ్వవిద్యాల పరిరక్షణ సమితి ఏర్పాటు :**

నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని యోగాహాలులో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అత్యవసర సమావేశం నిర్వహించి హాజరైన 40మందికిపైగా తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితిని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. సమితి సమన్వయకర్తలుగా జ్యోతిషశాస్త్ర విభాగానికి చెందిన డా. బి.వి.సత్యనారాయణ, జర్నలిజయం విభాగానికి చెందిన రాత్లావత్ గోపాల్‌లు నియమితులయ్యారు. రేపు జులై 3 నుండి విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో రిలే నిరాహారదీక్షలు, ఉదయం 11నుండి 1గంట వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఉద్యమానికి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, వివిధ రంగాల ప్రముఖులు, తెలుగుభాషా-సంస్కృతి పరిరక్షకులు, భాషాభిమానులు, తెలంగాణ ప్రజలందరూ సంఘీభావం ప్రకటించాలని సమితి పిలుపునిచ్చింది,

## డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తాయని మోసం

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి ముగ్గురి నుంచి రూ.10.30 లక్షలు వసూలు చేసి ఇద్దరిపై ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్‌కు చెందిన డ్రైవర్ శ్రీరంగం రాజశేఖర్, తన స్నేహితులు సుధరాసి బాబు, ఎం. మల్లాద్రితో కలిసి దాసరి రవికుమార్ అలియాస్ రవి, డీవీటీ వెంకటరాములు అలియాస్ రమణతో పరిచయం ఏర్పడింది. ప్రసాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న ఇందిరానగర్ కాలనీలో మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఒక్కొంటికి రూ.7 లక్షలకు ఇప్పిస్తామని వారు నమ్మించారు. 2022 ఫిబ్రవరిలో రాజశేఖర్ తొలుత రూ.50 వేలు, మల్లాద్రి, సుధరాసి బాబు కలిసి రూ.1 లక్ష చెల్లించారు. అనంతరం రాజశేఖర్ నుంచి విడతల వారీగా మొత్తం రూ.6.50 లక్షలు, మిగిలిన ఇద్దరి నుంచి రూ.2.80 లక్షలు తీసుకున్నారు. మొత్తం రూ.10.30 లక్షలు వసూలు చేసినప్పటికీ ఇళ్లు ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఐదేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా రమణ రూ.6 లక్షలకు చెక్కు ఇవ్వడంతో పాటు ఓ ఆస్తికి సంబంధించిన ఎంఓయూ రాసిచ్చినా, ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదని బాధితులు ఆరోపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జలమండలి పేరుతో రూ.2.80 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

నీటి బిల్లు బకాయి ఉందని, కేవైసీ అప్‌డేట్ చేయాలని చెప్పి నకిలీ యాప్ ఇన్‌స్టాల్ చేయించి వ్యాపారవేత్త బ్యాంకు ఖాతా నుంచి రూ.2.80 లక్షలు కాజేసిన సంఘటన వెలుగుచూసింది. పంజాగుట్టకు చెందిన వ్యాపారవేత్త సుబ్బారెడ్డిగారి లోకనాథ్ రెడ్డి (67)కు జూన్ 20న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారి అని పరిచయం చేసుకున్నాడు. వాటర్ కనెక్షన్ నిలిపివేయకుండా ఉండాలంటే కేవైసీ పూర్తి చేసి రూ.10 వెరిఫికేషన్ చెల్లించాలని సూచించాడు. ఓ ఏపీకే ఫైల్ పంపించి ఇన్‌స్టాల్ చేయించాడు. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన లేక తన కమారుడిని సంప్రదించగా అది మోసమని చెప్పడంతో రూ.10 చెల్లించలేదు. అయినప్పటికీ యాప్ ద్వారా బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరడంతో జూన్ 25, 26 తేదీల్లో రూ.1 లక్ష వంతున, జూన్ 27న మరో రూ. 80,400 చొప్పున మొత్తం రూ.2,80,400 ఖాతా నుంచి డ్రా చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్మీ ఉద్యోగం అని నమ్మబలికి అమ్మాయికి వల

**-చాలా రోజులుగా సహజీవనం..యువకుడు అరెస్టు**

**ఎల్.బి.నగర్, జులై 2,ప్రభాతవార్త:**



(ఆర్మీ డ్రెస్ లో గోవర్ధన్ ఫైల్ ఫోటో)

ఆన్‌లైన్ ద్వారా వ యోధిని పరిచయం చేసుకొని పెళ్లి పేరుతో మోసం చేశాడు. ఆర్మీ అధికారిని అంటూ అమ్మాయిని నమ్మించి చాలా రోజులు సహజీవనం చేశాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టే షన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన శామీర్‌పేట్‌కు చెందిన ముకేరా గోవర్ధన్(29) అనేవ్యక్తి తాను ఆర్మీ అధికారినని నమ్మిస్తూ నకిలీ ఏఐ ఫోటోలను ఉపయోగించి యువతితో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ఆమెను ప్రేమిస్తున్నట్లు నమ్మించి, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి, ఆమెతో సహజీవనం చేస్తూ శారీరకంగా దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గోవర్ధన్ తన తండ్రి ఆరోగ్యం బాగోలేదని చెబుతూ బాధితురాలి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని మోసం చేయడంతో పాటు, ఆమెను బెదిరింపులకు గురిచేసినట్లు యువతి ఫిర్యాదు చేసిందని తెలిపారు. అయితే గోవర్ధన్‌కు అప్పటికే ఇప్పటికే వివాహం జరిగినట్లు వెల్లడైంది. అంతేకాకుండా, ఇదే తరహాలో గత ఏడాది ఆల్వాల్‌కు చెందిన మరో మహిళను కూడా పెళ్లి పేరుతో మోసం చేసిన కేసులో అరెస్టై జైలుకు వెళ్లి, ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. బాధితురాలు లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నాగోల్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపారు.

### పెళ్లి పీటలెక్కిన బాలికను రక్షించిన జూబ్లీహిల్స్ పోలీసులు

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ పరిధిలోని పెద్దమ్మ ఆలయంలో బాల్యవివాహాన్ని పోలీసులు అడ్డుకుని మైనర్ బాలికను రక్షి ంచారు. అంగన్‌వాడీ టీచర్ పి. అనిత ఫిర్యాదు మేరకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006లోని సెక్షన్లు 9, 10 కింద కేసు నమోదు చేశా రు. పోలీసుల కథనం ప్రకారం.. 17 సంవత్సరాల 4 నెలల వయసున్న ఒక బాలికకు పాలివెల రాజు(22)తో బుధవారం మధ్యాహ్నం పెద్దమ్మ ఆలయంలో వివాహం జరుపుతున్నట్లు ఆలయ పూజారి పోలీసులకు సమాచారం అందించారు. వెం టనే స్పందించి ఆలయం వద్దకు వెళ్లిన జూబ్లీహిల్స్ పోలీసులు వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను రక్షి ంచి చైల్డ్ హెల్ప్‌లైన్‌కు అప్పగించారు. ఈ వివాహానికి బాలిక తల్లి, బాబాయి, అత్త సహకరించినట్లు గుర్తించిన పోలీసులు వరుడు పాలివెల రాజు తో పాటు కుటుంబ సభ్యులు వేముల రామ, వేముల పెద్దు, వేముల లక్షి ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ మెడలో మంగళసూత్రం చోరీ

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

కల్లు తాగి స్పృహ తప్పిన ఓ మహిళ మెడలోని బంగారు మంగళసూత్రం చోరీకి గురైన ఘటన బోరబండ ఠాణాలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ వినాయకరావు నగర్‌కు చెందిన చినిగారి లక్షి ్మ (55) జూన్ 20న యూసుఫ్‌గూడ కల్లు దుకాణంలో కల్లు తాగిన అనంత రం స్పృహ కోల్పోయింది. కొంతసేపటి తర్వాత తేరుకుని చూడగా మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు మంగళ సూత్రం కనిపించలేదు. సుమారు రూ.62 వేల విలువైన మం గళసూత్రాన్ని తాను స్పృహలో లేని సమయంలో గుర్తు తెలి యని వ్యక్తులు అపహరించి ఉంటారని బాధితురాలు అనుమా నం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి పేరుతో మైనర్‌పై లైంగిక దాడి

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

పెళ్లి పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఈ సంఘటనలో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన మైనర్ బాలిక(17)కు 2025 మార్చిలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి చెందిన వినయ్ (19)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. జూన్ 30, జులై 1 తేదీల్లో తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో నిందితుడు బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించి ముఖం చాటేయడంతో మోసం చేశాడని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బెటాలియన్ బస్సు కింద పడి డెలివరీ బాయ్ మృతి

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:** పోలీసు బెటాలియన్‌కు సంబంధించిన బస్సు కింద పడి డెలివరీ బాయ్ మృతిచెందిన సంఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని సయ్యద్ నగర్‌కు చెందిన దొంగల విష్ణుమూర్తి (26) ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విధుల్లో భాగంగా వినియోగదారులకు ఉత్పత్తులు పంపిణీ చేసి తిరిగి వస్తుండగా, యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని జకీ బావర్చి హోటల్ వద్ద అతను నడుపుతున్న యాక్టివా స్కూటర్‌ను సిరిసిల్ల 17వ బెటాలియన్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుమూర్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతుండగానే అతను మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి రోజు చికెన్ వండలేదని భార్యపై దాడి

**జూబ్లీహిల్స్, జులై 2, ప్రభాతవార్త:**

పెళ్లి రోజు తనకు ఇష్టమైన చికెన్ కూర వండలేదని భార్యపై భర్త దాడికి పాల్పడిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. బీఎస్ మక్తా ప్రాంతానికి చెందిన ప్రతాప్(42) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతని పెళ్లి రోజు కావడంతో పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన ప్రతాప్ చికెన్ కూర వండలేదని భార్య దీపికతో గొడవపడ్డాడు. అనంతరం కోపంతో పక్కనే ఉన్న కర్రతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈశ్వరమ్మ యాదవ్‌కు సన్మానం


ఈశ్వరమ్మ యాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీ షిర్డీసాయి బాబా ఆలయ ప్రతినిధులు

**వనస్థలిపురం. జూలై. 2.ప్రభాతవార్త.**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన చింతలకుంట నివాసి పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను గురువారం వనస్థలిపురం, ప్రశాంత్ నగర్ లో గల శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆలయకమిటి,కాలనీ సంక్షేమ సంఘం,మహిళ మండలి సభ్యులు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆలయ వైస్ చైర్మన్ లు వేణుగోపాల్,వెంకటేశ్వర రావు, కోశాధికారి రమేష్, ఈ.సి. మెంబర్లు శ్రీనివాస్,సీతా రామిరెడ్డి నిర్మలా చౌదరి, కాలనీ ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి,హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, పద్మా రెడ్డి,యుగంధర్ రెడ్డి,ఎస్.ఆర్.లాబోరేటరీ డైరెక్టర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల


ఓల్డ్ మలక్ పేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

**మలక్ పేట, జూలై 2 , ప్రభాతవార్త:**
ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ శంకర్ నగర్ లోని వివిధ శాఖల అధికారులతో కలిసి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న కలుషిత మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్య, రోడ్డు సమస్య తదితర వాటిని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పరిశీలించారు. వెంటనే ఎమ్మెల్యే బలాల స్పందించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైఫుద్దిన్ షఫీ, అన్వర్ పాష, సిబ్బంది మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

**ఎల్‌బినగర్, జులై 2 ప్రభాతవార్త:**
బ్రహ్మోత్సవాల సందర్భంగా సుదర్శన హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గడ్డిఅన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో 2వ పుష్కర బ్రహ్మోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు అయిన గురువారం ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్, రుద్వికులు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమము నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఎదురుకొల్లా కార్యక్రమం ఉంటుందని, శుక్రవారం సాయంత్రం స్వామివారి కళ్యాణము నిర్వహించడం జరుగుతుందని దేవాలయం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, ప్రధానకార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు పాల్తి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, ఊర నరసింహగుప్తా, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, మార్గం రమేష్, భక్తులు పాల్గొన్నారు.

### దుర్గాభవాని నగర్ పార్కు స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలి : ఎలిమినేటి నిషికాంత్‌రెడ్డి

**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ దుర్గాభవాని నగర్ సర్వే నెం.39, 42, 49లో ఉన్న పార్కు స్థలాన్ని ఆక్రమణదారుల నుండి హైడ్రా విడిపించి ప్రజల వినియోగానికి తీసుకురావడం పట్ల కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నిశికాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజోపయోగ స్థలాలను పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ భూములు పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. హైడ్రా స్వాధీనం చేసుకున్న పార్కు స్థలాన్ని జీహెచ్‌ఎంసి అధికారులు వీలైనంత త్వరగా అభివృద్ధి చేసి స్థానికులకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటస్థలం, బెంచీలు, లైటింగ్, గ్రీనరీ తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిషికాంత్‌రెడ్డి కోరారు.

### కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో సినీ హీరో విరాట్ కర్ణ పూజలు

**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** నాగబంధం చిత్ర కథానాయకుడు విరాట్ కర్ణ గురువారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుండి ఈ ఆలయానికి వస్తున్నానని, ఇక్కడ ధ్యానం చేయడం మనస్సుకు ప్రశాంతతను ఇస్తుందన్నారు.

## అర్హులందరి పేర్లు నమోదు చేయాలి

**: మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి**


'సర్' వివరాలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** సైదాబాద్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్‌ఓలు తప్పని సరిగా ఇంటింటికి తిరుగుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు చేయాలని, అనర్హుల పేర్లు తొలగించాలని సూచించారు.

## ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**-క్యాంపు కార్యాలయంలో ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**తుర్కయంజాల్, జూలై 2, ప్రభాతవార్త**
ప్రత్యేక సర్ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తున్న నేపథ్యంలో, క్యాంపు కార్యాలయానికి వచ్చిన బీఎల్వోలు ఎమ్మెల్యేకు ఎన్యూమరేషన్ పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే తన వ్యక్తిగత ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని నమోదు చేసి ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు అందజేశారు. అనంతరం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నియోజకవర్గంలో ఎలా కొనసాగుతోంది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తోంది, ఇంటింటి సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి అనే అంశాలపై బీఎల్వోలతో వివరాలు తెలుసుకున్నారు.ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రజలు పూర్తి సహకారం అందించాలని, బీఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని సూచించారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించి, సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని కోరారు.నియోజకవర్గంలోని ప్రతి అర్హ ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందుతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు.

## నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకారం

**-పరిశ్రమల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం : అధ్యక్షుడు మహేందర్ రెడ్డి**


కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు

**నాచారం, జూలై 2 ప్రభాతవార్త :** నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నాచారంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గానికి పాత కమిటీ అధ్యక్షుడు, కమిటీ ప్రతినిధులు అధికారికంగా బాధ్యతలను అప్పగించారు.ఈ సందర్భంగా పాత కమిటీ సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కె. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాత కమిటీ అందించిన సహకారం, సేవలను కొనసాగిస్తూ పరిశ్రమల అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.సమావేశంలో నూతన ఉపాధ్యక్షుడు ఎస్. పూర్ణ చంద్రరావు, కార్యదర్శి ఎన్. శంకర్, సంయుక్త కార్యదర్శి ఎన్. సురేందర్ రెడ్డి, కోశాధికారి ఎం.డి. సర్దార్ ఖాన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు డి. చక్రధర్, కె. సతీష్, ఆర్. రామచంద్ర మూర్తి, వై. జనార్ధన రావు, ఎం. బాలకృష్ణ రెడ్డి, మనోజ్ మక్దానీ, వి. వెంకటేశ్వర్ రావు, వినయ్ కుమార్ జైన్, పి. కమల్ ప్రసాద్, టి. సత్తి రెడ్డి పాల్గొన్నారు.అదేవిధంగా పాత కమిటీ అధ్యక్షుడు డి.కె. జైన్‌తో పాటు కమిటీ ప్రతినిధులు వి.టి. శివ, ఎన్. సురేందర్ రెడ్డి, వి. జైరాజ్, భంజీ భాయ్ పటేల్, టి. సత్తి రెడ్డి, విజయేంద్ర బాజ్‌పాయ్, వి.వి. రావు, కమల్ పెద్దింటి, వినయ్ కుమార్ జైన్, మనోజ్ మక్దానీ, తిరుపతి రెడ్డి, రాము మలాజీ తదితరులు హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగగా, పరిశ్రమల అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారం, అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసే అంశాలపై సభ్యులు చర్చించారు.

## వైభవంగా వెస్లీ కోఎడ్యుకేషన్ హైస్కూల్ స్వర్ణోత్సవ వేడుకలు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పూర్వ అధ్యాపకులు

**నాచారం, జూలై 2 ప్రభాతవార్త :** నాచారంలోని వెస్లీ కోఎడ్యుకేషన్ హైస్కూల్ (టిడబ్ల్యుఎ) స్వర్ణోత్సవ (50 ఏళ్ల) వేడుకలు గురువారం వెస్లీ కోఎడ్యుకేషన్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగభరితంగా సాగింది. 1965 నుంచి వివిధ సంవత్సరాల్లో ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన సుమారు 1,200 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని తమ విద్యార్థి దశ మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఐదు దశాబ్దాలుగా విద్యా సేవలు అందిస్తున్న పాఠశాల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల చరిత్ర, పూర్వ విద్యార్థుల విజయగాథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువుల సన్మానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ జీవితాలకు పునాది వేసిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు పొందడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థుల కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. భవిష్యత్తులో పాఠశాల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహకరిస్తామని అలుమ్నీ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమానికి పాఠశాల వ్యవస్థాపకులు పి. స్వామి దాస్, మాజీ పీటీ ఉపాధ్యాయుడు ఇమ్మానుయేల్, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కన్వీనర్లు ఏ. టు. జెడ్. శ్రీనివాస్ రెడ్డి, మింద్రాల స్వామి, బి. ఎమ్మాన్యువల్ నాయకత్వం వహించారు. 1985-1991 బ్యాచ్‌కు చెందిన వి. రాజిరెడ్డి, ఓంకార్, సీతారాం మన్నవ, పల్లె రాజ్‌కుమార్ గౌడ్ పూర్వ విద్యార్థుల కోసం భోజన వసతులు ఏర్పాటు చేశారు.ఈ వేడుకల్లో బోదాసు లక్ష్మీనారాయణ, ఎస్పై గంగాధర్ తో పాటు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగిన అనేక మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. దశాబ్దాల తర్వాత స్నేహితులు, గురువులు ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం ఆప్యాయత, అనుబంధాలు, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ ఆత్మీయ సమ్మేళనం పాత స్నేహాలను పునరుద్ధరించడంతో పాటు గురుశిష్య బంధాన్ని మరింత బలోపేతం చేసిందని పాల్గొన్న పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కమిటీల పేరుతో కాలయాపన చేస్తే మరో ఉద్యమం తప్పదు : చైర్మన్ కాచం సత్యనారాయన


పోలీస్‌స్టేషన్ వద్ద కాచం సత్యనారాయణ తదితరులు

**ఎల్‌బినగర్, జులై 2 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు విషయంలో ప్రభుత్వం జాప్యం చేయొద్దని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణగుప్త డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్)చీఫ్ కల్వకుంట్ల కవిత ఉద్యమకారులకు భూపోరాటం పిలుపుతో కాచం సత్యనారాయణను చైతన్యపురి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఏ పార్టీకి కొమ్ముకాయదని, ఉద్యమకారుల సంక్షేమం కోసం పనిచేసే సంఘాల తోటి కలిసి ప్రయాణం చేస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చే క్రమంలో ఉద్యమకారుల సంఘాలకు పార్టీలతోని పని లేకుండా మద్దతు తెలుపుతామన్నారు. అక్రమ ముందస్తు అరెస్టులకు, పోలీస్ నిర్బంధాలకు భయపడేది లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం 2001 నుండి 2014 వరకు రాష్ట్ర సాధనలో కీలక భూమిక వహించిన శ్రీకాంతాచారి త్యాగం వృధా పోకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం వారి ఆకాంక్షల కోసం మరో ఉద్యమాన్ని కూడా ఎల్బీనగర్‌నే అడ్డాగా చేసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల స్థలము, గుర్తింపుకార్డు, రూ.25వేల పెన్షన్ లాంటి హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు తగిన గౌరవం కల్పిస్తూ, ఆగస్టు 1లోపు ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆగస్టు 6న ట్యాంక్ బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సం ఘం తామే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌గుప్తా, ఇరుగు శ్రీధర్, కొత్త రవి, కూర రమేష్, శ్యామ్‌సుందర్‌నేత, కృష్ణ, శ్రీనివాస్, తేలు కుంట్ల కృష్ణ, శివ, సురేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఉత్పత్తిదారుల సంస్థకు సహాయ సహకారాలు అందించాలి : మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ


ఎఫ్‌పిఓ స్టోర్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ: పక్కన పిఏసి చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జులై 2 ప్రభాతవార్త:** రైతుల ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఓ-ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)కు అందరూ సహాయ సహకారాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ పిలుపునిచ్చారు. బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మెయిన్ రోడ్డులో కార్వాన్ కమర్షియల్ భవనంలో బండ్లగూడ ఖాల్సా-బాలాపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన రైతుల ఉత్పత్తుదారుల సంస్థ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హాజరైన ఎండి అన్నపూర్ణ బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పిఏసి చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డితో కలిసి ఎఫ్‌పిఓ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనిట్ స్టోర్స్‌లో రైతులకు సంబంధించిన ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 10 వేల ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌లను ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని అన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 908 సహకార సంఘాల్లో 311 సొసైటీలను ఎఫ్‌పిఓలుగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇవి మార్కెటింగ్ ద్వారా పని చేస్తాయని ఆమె వివరించారు. రైతులు అభివృద్ధి కావాలనే లక్ష్యంగా పని చేసే ఎఫ్‌పిఓలను ఆదరించాలని ఆమె ప్రజలను కోరారు. అన్ని రకాల ఆహార ఉత్పత్తులు ఆర్గానిక్‌కు సంబంధించి స్టోర్‌లలో అందుబాటులో ఉంటాయని ఆమె అన్నారు. నేడు రసాయన ఉత్పత్తుల ద్వారా క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యాలను కాపాడుకోవడానికి ప్రాధాన్యత పెరుగుతున్నదని ఆమె అన్నారు. ఇటు రైతులకు లాభదాయకంగా అటు వినియోగదారుల ఆరోగ్యదాయకంగా మేలు చేసే ఆర్గానిక్ ఉత్పత్తులకు సంబంధించిన స్టోర్‌ల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీ పిఏసి చైర్మన్, డిసిసిబి మాజీ చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పిఓ యూనిట్‌లో బండ్లగూడ ఖాల్సాకు సంబంధించిన సభ్యులందరినీ భాగస్వాములను చేయాలని అధికారులను కోరారు. ఈ స్టోర్‌ల అభివృద్ధికి సహాయ సహకారాలు, తోడ్పాటునందిస్తామని ఆయన స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో తమ సొసైటీని ఎఫ్‌పిఓగా తీసుకున్నందుకు పెంటారెడ్డి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్, ఎఫ్‌పిఓ నోడల్ ఆఫీసర్ సురేఖ రాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు సరస్వతమ్మ, రవికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకుమార్, బండ్లగూడ ఖాల్సా సొసైటీ పిఏసి డైరెక్టర్లు కొంతం సంపత్‌రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, రావుల లింగం, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం నిరంజన్‌రెడ్డి, సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎర్ర జైహింద్‌కుమార్, భాగ్యనగర్ సిఇఓ పిండి నారాయణరెడ్డి, బండ్లగూడ ఖాల్సా సిబ్బంది పగుడాల శ్రీకాంత్‌గౌడ్, సాయి, రాధ పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

**: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, జూలై 2 ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిఆర్‌ఎస్ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు కార్యకర్తలు తమ తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటర్లకు తగు సహకారం అందించాలని సూచించారు .ఎక్కడా అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగిపోకుండా, కొత్తగా అర్హత పొందిన వారందరి పేర్లు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు.. సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### హబ్సిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్‌రెడ్డి



**ఉప్పల్, జూలై 2 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి నియమి తులైయ్యారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని డివిజన్‌లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటా మని ధీమా వ్యక్తం చేశారు. దీన్ని ఒక పదవులా కాకుం డా ఒక బాధ్యతగా భావించి, డివిజన్‌లో పార్టీ బలో పేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తనకు కీలక పదవి దక్కేలా సహకరించిన హబ్సిగూడ పార్టీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలిపారు. గతంలో జిల్లా మాజీ యూత్ కాం గ్రెస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి నియామకంతో హబ్సిగూడ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

### ఉప్పల్ డిప్యూటి కమిషనర్‌గా ఆనంద్‌కుమార్



**ఉప్పల్, జూలై 2 ప్రభాతవార్త :** ఉప్పల్ డిప్యూటి కమిషనర్‌గా కె.ఆనంద్‌కుమార్ నియమితులైయ్యారు. ఇక్కడ ఇంచార్జీ డిప్యూటి కమిషనర్‌గా పనిచేస్తున్న బోడుప్పల్ కమిషనర్ శైలజను తిరిగి బోడుప్పల్‌కు నియమించారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కె.ఆనంద్‌కుమార్‌కు డిప్యూటి కమిషనర్‌గా అధనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. సర్ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని, నిరంతరం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని, ఫిర్యాదులు ఉంటే సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు జీర్ణించుకోలేకపోతున్నాయి: శంకర్‌రెడ్డి


మాట్లాడుతున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ చురుకుగా సాగుతుంటే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఎందుకు గగ్గోలు చేస్తున్నాయని రాష్ట్ర బిజెపి కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలన్ శంకర్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ దేశానికి చాలా అవసరమని అన్నారు. దొంగ ఓట్లతో లబ్ధిపొందాలనే పార్టీలకు ఎస్ఐఆర్ చెంపపె ట్టులాంటిదని ఆయన పేర్కొన్నారు. అక్రమ వలసదా రులైన బంగ్లాదేశీలు, బర్మా రోహింగ్యాలను ఓటర్లుగా నమోదు చేయించే ఎంఐఎంతో చేతులు కలిపిన పార్టీలు ఎస్ఐఆర్‌ను జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలుస్తున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలు బిజెపిపై విషం చిమ్ముతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలంతా ఎస్ ఐఆర్ ప్రక్రియను గమనిస్తున్నారనీ భవిష్యత్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని శంకర్‌రెడ్డి హెచ్చరించారు.


మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేస్తున్న బిఎల్‌ఓ, బిఎల్ఏ


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను గ్రేటర్ హైదరాబాద్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంరెడ్డి భుజంగ రెడ్డి చింతలకుంట లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.(ప్రభాతవార్త.. వనస్థలిపురం.).

## పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**తుర్కయంజాల్ జులై 2ప్రభాతవార్త :**
ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల 6 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చొరవ తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తొర్రూర్ డివిజన్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిషన్ మాట్లాడుతూ ఆదిభట్ల సర్కిల్లో సుమారు 71 మంది మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు గతంలో మున్సిపాలిటీలుగా ఉన్నప్పటి నుండి గత మూడు సంవత్సరాలుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారని ఈ కార్మికులకు ఏ రోజు కూడా ప్రతి నెల సకాలంలో వేతనాలు ఇవ్వకుండా మూడు నాలుగు నెలలకు ఒకసారి ఇస్తూ వీరితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. వెంటనే కార్మికులకు రావలసిన ఆరు నెలల పెండింగ్ వేతనాలతో పాటు ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు అన్నీ కూడా కల్పించే విధంగా చూడాలని కోరారు.అనంతరం జిహెచ్‌ఎంసి కమిషనర్ సత్యనారాయణ రెడ్డితో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్మికులందరి సమస్యలను పరిష్కారం చేసే విధంగా చొరవ తీసుకోవాలని అదే విధంగా 71 మంది కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు జిహెచ్‌ఎంసి, ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలని వెంటనే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ మాధవరెడ్డి, కార్మికులు నార్లకంటి సాలయ్య, మోలుగు కృష్ణ, రాసమల్ల రవి, కందాల రవి, చెక్క స్వప్న, మల్లెల జయ, దీవెన, జ్యోతి, ప్రశాంత్ జంగయ్య అంజి, పెంటయ్య, ప్రదీప్, సంతోష్ పాల్గొన్నారు

## నందిహిల్స్‌లో ఆలయ ఆర్చి ప్రారంభం


నందిహిల్స్‌లో ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విజయ్‌కుమార్

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్ ప్రశాంతిహిల్స్ డివిజన్‌లోని నందిహిల్స్ కాలనీలోనున్న శ్రీ అరుణాచలేశ్వర, కనకదుర్గ, అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. దాతల సహకారంతో నిర్మించిన ఆలయ ఆర్చిని టెంపుల్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, తన్నీరు రంగారావు, లక్ష్మీనారాయణ, చల్లా సురేందర్‌రెడ్డి, రామిడి నర్సిరెడ్డి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

### నేడు బడంగ్‌పేట్ డిసి కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై సమన్వయ సమావేశం

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమంపై సమన్వయ అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లకు సహాయం కోసం హెల్ప్ డెస్క్ ఆపరేటర్ల నియామకం, వారసుల అనుసంధానం (మాపింగ్) ప్రక్రియపై ప్రత్యేక దృష్టి తదితర అంశాల నిమిత్తం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు శుక్రవారం జరిగే సమన్వయ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన పెంచుకోవాలి


పత్రాలను అందజేస్తున్న తోట మహేష్‌యాదవ్

**ఎల్‌బినగర్, జులై 2 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్‌పై ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకొని తమ ఓటును భద్రపరుచుకోవాలని చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని కనిగిరి కాలనీలో బూత్ లెవెల్ ఏజెంట్లు బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలిసి గురువారం ఇంటింటికి తిరుగుతూ ఎస్ఐఆర్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రాధాన్యతను గురించి ఓటర్లకు వివరించారు. రాజ్యాంగబద్ధంగా మనకు లభించిన ఓటు హక్కు ఎస్ఐఆర్ ద్వారా భద్రపరచుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు అజయ్, బూత్ లెవెల్ ఆఫీసర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

### ఉప్పల్ అసెంబ్లీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామకం

**ఉప్పల్, జూలై 2 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ కమిటీల అధ్యక్షుల నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను సంప్రదించి డివిజన్ అధ్యక్షుల నియామకాన్ని పిసిసి అధ్యక్షుడు ఆమోదించారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని, పార్టీని పటిష్ఠంగా నిర్మించేందుకు కృషి చేయాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. డివిజన్ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. కావలి అనూప్ రాజ్ యాదవ్(వంపుగూడ), టి.శ్రీహరి( కాప్రా), కేశెట్టి ప్రసాద్ (ఏ.ఎస్.రావునగర్), కౌకుట్ల ప్రకాశ్ రెడ్డి (కుషాయిగూడ), బొడిగ ప్రభు గౌడ్ ( చర్లపల్లి), వడ్లకొండ కృష్ణ (శక్తి సాయినగర్), పోలిపాక ఆంజనేయులు (హెచ్.బి.కాలనీ), జమీలా బేగం (మల్లాపూర్), నూతల కంటి రాజు (నాచారం), వరకాల మహేష్ యాదవ్ ( హెచ్.ఎం.టి. నగర్), నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్ (చిలుకానగర్), ఆకిటి అగంరెడ్డి (బీరప్పగడ్డ),.కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ( హబ్సిగూడ), పెద్దిరాజు సందీప్ కుమార్ (రామంతాపూర్), నామ్ రాజి రెడ్డి (వెంకట్ రెడ్డి నగర్), ఈగ ఆంజనేయులు ముదిరాజ్ (ఉప్పల్) నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు త్వరలోనే అమలులోకి వస్తాయని తెలిపారు.

### ఉప్పల్ సర్కిల్‌లో సర్ విచారణ కేంద్రం ఏర్పాటు

**ఉప్పల్, జూలై 2 ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక విచారణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు డిప్యూటి కమిషనర్ కె.ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విచారణ కేంద్రాన్ని ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు ఓటర్ల జాబితాలలో పేర్లు, ఇతర సమాచారం కోసం విచారణ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. 2002 ఓటర్ల జాబితాలలో పేర్లు సరి చూసుకోవాలని, ఇతర వివరాల కోసం 8639382240 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.